896) రామక్రియ / కల్యాణి

ప॥ గరుడ ధ్వజంబెక్కె కమలాక్షు పెండ్లికి । పరుష లదివో వచ్చె పైపై సేవించను ॥

చ॥ పాడిరి సోబాన నదె భారతియ గిరుజయు । ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల ।
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి । వేడుకలు మీరగ శ్రీవిభుని పెండ్లికిని ॥

చ॥ కురిసె పువ్వులవాన కుప్పలై యెందు చూచిన । మొరసె దేవదుందుభి మోతలెల్లను ।
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి । తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని ॥

చ॥ వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల । పోసిరదె తలబాలు పుణ్యసతులు ।
ఆసల శ్రీవేంకటేశుడలమేలుమంగ తాను । సేసలు వెట్టిన యట్టి సింగారపు పెండ్లికి ॥